అద్వితీయ ప్రగతి

c/o కణితి జెడ్పీ హైస్కూల్

నాడు: సర్కారు బడులంటే వర్షానికి కారిపోయే తరగతి గదులు.. పెచ్చులూడిన శ్లాబ్‌లు, గచ్చులు, శిథిలావస్థకు చేరిన బాత్‌రూమ్‌లు.. మరోవైపు ఉపాధ్యాయుల కొరత.. సమయానికి అందని పుస్తకాలు.. ఇలా చెబుతూ పోతే ఎన్నో లోపాలు..

నేడు: కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన పాఠశాలలు.. ఆధునిక వసతులు.. చక్కని బెంచీలు, డెస్కులు, రన్నింగ్ వాటర్ సదుపాయంతో బాత్‌రూమ్‌లు.. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు.. పాఠశాలలు తెరిచే నాటికే పుస్తకాలతో పాటు యూనిఫాం, బెల్ట్, టై, బ్యాగ్, షూ తదితర వస్తువులతో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ.. ఇలా.. విప్లవాత్మక సంస్కరణలు

ఫలితం: అనూహ్యంగా పెరుగుతున్న అడ్మిషన్లు. సర్కారు బడుల్లో పెరిగిన విద్యా ప్రమాణాలు. ఉత్తీర్ణతను గమనిస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు క్యూ కడుతున్నారు. ఇందుకు నిదర్శనమే కణితి జిల్లా పరిషత్ హైస్కూల్లో 200 దాటిన అడ్మిషన్లు.. ప్రగతి అంటే ఇదీ అని చాటిచెబుతున్న పాఠశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

- ఈ ఏడాది 200 దాటిన అడ్మిషన్లు
- తమ పిల్లలను చేర్పించేందుకు క్యూ కడుతున్న తల్లిదండ్రులు
- ఆధునిక వసతులు, మెరుగైన ఫలితాలతో గుర్తింపు


పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటున్న 6వ తరగతి విద్యార్థులు


సీటు కోసం పాఠశాల ఆవరణలో వేచి ఉన్న తల్లిదండ్రులు

కూర్మన్నపాలెం: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అద్భుత ఫలితాలతో దూసుకుపోతోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపును సంతరించుకోవడంతో పాటు పదో తరగతిలో చక్కని ఫలితాలు సాధించడం, ఈ పాఠశాల విద్యార్థి 586 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడంతో తల్లిదండ్రులు కణితి హైస్కూల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో గతేడాదితో పోల్చి చూస్తే ఊహించని రీతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అన్ని తరగతులు కలిపి సుమారు 200 మంది విద్యార్థులు చేరినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. మరో 60 మంది కొత్త విద్యార్థులకు టీసీలు రాకపోవడంతో వారి అడ్మిషన్లు ఖరారు కాలేదు. 10 రోజుల వ్యవధిలో వారి అడ్మిషన్లు కూడా ఖరారైతే విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుంది. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. గతంలో 29 మంది ఉపాధ్యాయులు ఉండగా ఈ ఏడాదిలోనే దాదాపు 20 మంది కొత్త ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో ఉపాధ్యాయులు సంఖ్య 49కి చేరింది.

సీబీఎస్ఈ సిలబస్

పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి వరకు సీబీఎస్ఈ ప్రవేశపెట్టడంతో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌లో బోధన సాగుతోంది. పదో తరగతిలో మాత్రం ఈ ఏడాదికి స్టేట్ సిలబస్ ఉంది. ఇక పదో తరగతిలో ఒక్క సెక్షన్ తప్ప మిగిలిన అన్ని తరగతుల్లో ఇంగ్లిష్ మీడియంలోనే బోధన సాగుతోంది. పదో తరగతి బీ సెక్షన్‌లో తెలుగు మీడియం ఉంది.

అభివృద్ధి ఇలా..

నాడు–నేడు మొదటి విడతలో కణితి జెడ్పీ హైస్కూల్‌కు రాష్ట్రప్రభుత్వం 87 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాల మరమ్మతులు, 500 బెంచీలు, ల్యాబ్‌లో పరికరాలు, పాఠశాల ప్రాంగణం అభివృద్ధి, బాత్‌రూమ్‌లలో వసతులతో పాటు సుందరీకరణ పనులు చేపట్టారు. రెండో విడతగా 72 లక్షల రూపాయలు విడుదల చేయడంతో ఆధునిక సదుపాయాలతో 6 గదులతో రెండంతస్తుల కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక పాఠశాల విషయానికి వస్తే మొత్తం తరగతి గదులు :16. కొత్త భవనం పూర్తయితే విశాలమైన మరో 6 తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం అమోఘం



ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అద్భుతం. నాడు–నేడు కార్యక్రమంతో మా పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. అన్ని సదుపాయాలతో పాటు విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకంతో విద్యార్థులు పాఠశాలలకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు.

–బి.ప్రకాశరావు, ప్రధానోపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలలే మేలు



కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నారు. ఆడుకునేందుకు చక్కని క్రీడా మైదానం, ఆహ్లాదకర వాతావరణంలో తరగతి గదులు, మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందించడం అన్నీ బాగున్నాయి. అందుకే మా పాపను ఈ ఏడాది ఆరో తరగతిలో ఇక్కడ జాయిన్ చేశాను.

– ఎల్లేటి రామలక్ష్మి, 6వ తరగతి విద్యార్థి తల్లి

ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం



ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని కృషి చేస్తున్నాం. విద్యార్థులకు మోడల్ పేపర్లు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల్లో వారు చేసిన తప్పులను, సరిదిద్ది ఎక్కడ తప్పు చేశారో వివరిస్తున్నాం, ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో గమనిస్తూ ఆ పాఠాలను మళ్లీ బోధిస్తున్నాం. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థి చదువుపై మరింత దృష్టి పెట్టేలా అవగాహన కల్పిస్తున్నాం. గ్రూప్ డిస్కషన్లు నిర్వహించడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

– అరుణ, ఉపాధ్యాయిని



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

తరగతుల వారీగా విద్యార్థులు

తరగతి	గతంలో విద్యార్థులు	కొత్తగా చేరిన వారు	మొత్తం విద్యార్థులు
3	20	6	26
4	27	6	33
5	41	9	50
6	51	125	176(2 సెక్షన్లు)
7	196	13	209(4 సెక్షన్లు)
8	216	11	227(4 సెక్షన్లు)
9	239	19	258(4 సెక్షన్లు)
10	237	5	242 (4సెక్షన్లు)
మొత్తం విద్యార్థులు	1027	194	1221

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జిల్లాలో రెండో స్థానం



నాకు పదో తరగతిలో 586 మార్కులు వచ్చాయి. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైంది. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపించేవారు. ప్రతీ అంశాన్ని వివరించేవారు. వారాంతపు పరీక్షలు, నెలవారీ పరీక్షలు నిర్వహించేవారు. సందేహాలు నివృత్తి చేసేవారు. ప్రత్యేక తరగతులు నిర్వహించారు. మోడల్ పరీక్షలు రాశాం. ఇలా.. ప్రణాళికాబద్ధంగా మమ్మల్ని పరీక్షలకు సిద్ధం చేశారు. అందుకే నాతో సహా ఎంతోమందికి మంచి మార్కులు వచ్చాయి. పాఠశాలలో వసతులు కూడా ఎంతో మెరుగుపడ్డాయి. మంచి మార్కులు సాధించిన నాకు ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకం కూడా అందింది. ఇంత గుర్తింపునిచ్చిన మా బడి నాకెంతో అపురూపం.

– బి.జి.ఎస్. అంజలి

క్లుప్తంగా

నేడు 69వ వార్డులో ‘జగనన్న సురక్ష’

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆదివారం తెలిపారు. నాతయ్యపాలెం బంగారుమాంబ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించనున్న కార్యక్రమంలో నాతయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం సచివాలయాల పరిధిలో దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేస్తారు. అనంతరం కాపుతుంగ్లాం శివాలయం వద్ద జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో కాపుతుంగ్లాం 01, కాపుతుంగ్లాం 02 సచివాలయాలకు సంబంధించిన దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు.

ఘనంగా ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలో కొలువైయున్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోన అప్పారావు, సలాది అచ్చిబాబు, విరోతి వరహాలు, గంతకోర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అమృత కలశాల అందజేత


పేదలకు అమృతకలశాలు అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అమృత కలశాలను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉక్కునగరం, అగనంపూడి, మదీనాబాగ్, నమ్మిదొడ్డి, ఎల్లమంచిలి దొడ్డి, పరవాడ, దువ్వాడ, ఇస్లాంపేట ప్రాంతాల్లో ఆదివారం ఈ పంపిణీ చేపట్టారు. అందులో పేదలకు ఒక్కో కుటుంబానికి నెలకు సరిపడేలా అత్యవసర కిరాణా సామగ్రి బియ్యం, కంది పప్పు, చింతపండు, వంట నూనె, ఎండుమిర్చిలను సమకూర్చారు. కార్యక్రమాల్లో సత్యసాయి సమితి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

బాలాజీ సన్నిధిలో మండలాభిషేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మండలాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అజస్రదీపారాధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠాపనం, నిత్య హోమం, కుంభారాధనం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పూజల్లో ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు పాల్గొన్నారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిరాశ్రయులకు వసతి

గోపాలపట్నం: కంచరపాలెం పరిధిలోని పలువురు నిరాశ్రయులైన యాచకులను ఐదో పట్టణ పోలీసులు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నైట్ షెల్టర్‌కు ఆదివారం తరలించారు. కంచరపా లెం సీఐ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు 9 మందిని నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత చేర్పించుకున్నారు.

జోరుగా సబ్సిడీ టమాటా విక్రయాలు

- రైతుబజార్లలో కౌంటర్ల వద్ద బారులు తీరుతున్న వినియోగదారులు


రైతుబజార్‌లో టమాటాల కోసం బారులు తీరిన కొనుగోలుదారులు

పెదగంట్యాడ: ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా టమాటా కిలో.50కే సబ్సిడీపై అందిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర కిలో రూ.120 నుంచి 150 వరకు ఉండటంతో వినియోగదారులు టమాటా పేరెత్తితేనే హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం సబ్సిడీపై టమాటా కిలో రూ.50కే అందజేస్తోంది. ఆధార్ కార్డు చూపిన వినియోగదారులకు రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు సాగుతున్నాయి. బయటి మార్కెట్‌కు, రైతుబజారుకు కిలోపై రూ.70 పైనే వ్యత్యాసం ఉండటంతో రైతుబజార్లకు వినియోగదారులు క్యూ కడుతున్నారు. పెదగంట్యాడ రైతు బజార్‌లో రోజూ 500 కిలోల నుంచి 700 కిలోల వరకు విక్రయిస్తున్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పంచుమర్తి


ఎంపీ ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మీ భీమేష్

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 69వ వార్డు షీలానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పంచుమర్తి లక్ష్మీ భీమేష్ నియమితులయ్యారు. నరసరావుపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణిల నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. లక్ష్మీ భీమేష్ ప్రస్తుతం గుంటూరు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిశెట్టి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్, పల్నాడు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఓల్పు బాల తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి.. దుకాణాల వైపు దూసుకొచ్చి..


దుకాణాల వైపు దూసుకొచ్చిన కారు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ, సమతానగర్ జంక్షన్‌లోని పోస్టాఫీసు వద్ద ఓ కారు అదుపు తప్పి దుకాణాలపైకి దూసుకువచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ కారు వుడా కాలనీ నుంచి సమతానగర్ వైపు వస్తోంది. అదే సమయంలో 16ఏళ్ల బాలుడు సైకిల్‌పై వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆ సైకిల్‌ను తప్పించే క్రమంలో కారు డ్రైవర్ బ్రేక్ నొక్కబోయి పక్కనే ఉన్న ఎక్సలేటర్‌ను నొక్కడంతో ఒక్కసారిగా కారు దుకాణాలపైకి దూసుకువచ్చింది. అక్కడ ఉన్న ఏపీజే అబ్దుల్ కలామ్ సెంటర్ సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజును వివరాలు అడగ్గా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న పైడిరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద నిరవధిక దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, సమ్మిడి రాజు, పంచదార్ల పెంటారావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష, కార్మిక సంఘాల సంఘీభావం

దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఉక్కు నిర్వాసితుల కార్మిక సంఘం, నిర్వాసిత సంఘాల నాయకులు ఆదివారం సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ రావు, మసేనురావు, ఎల్లేటి శ్రీనివాసరావు, కేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి జన్మదిన శుభాకాంక్షలు


ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీలో ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. వీసీని కలిసిన వారిలో బొడ్డ గోవింద్, నంబాళ్ల రాము, నిఖిల్ ఉన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఏయూ వీసీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

శాకాహారంతో ఆరోగ్యం పదిలం


ప్రచారంలో పాల్గొన్న స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

గాజువాక: శాకాహార విశిష్టతను వివరిస్తూ స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సొసైటీ నిర్వాహకురాలు కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని పిరమిడ్ మాస్టర్ వర్మరాజు జోగవానిపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శాకాహార విశిష్టతను సొసైటీ ప్రతినిధులు కరపత్రాల ద్వారా స్థానికులకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు ఎం.శివగణేశ్వరరావు, ప్రతినిధులు జయలక్ష్మి, శేషారత్నం, పీఎస్ఎన్ మూర్తి, సి.జగదీశ్వరి, పద్మావతి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి దుర్మరణం


మృతి చెందిన యాచకుడు

అక్కిరెడ్డిపాలెం: చట్టివానిపాలెం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదురుగా ఒక యాచకుడు మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆదివారం యాచకుడు డివైడర్‌పై మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వయసు 60 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందని, కాషాయ వస్త్రాలు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎక్కడి నుంచి వచ్చాడో వివరాలు తెలియలేదన్నారు.

‘కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలి’


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టు వదలక చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 878వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా భారతీయులు ఆర్థికంగా ఇంకా వెనుకబడి ఉన్నారని, ఈ సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అక్టోబర్‌లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ విజయం సాధించిన వారు నవంబర్‌లో విశాఖలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో గంటా నూకరాజు, సూర్యప్రకాశరావు, ప్రేమ్ కుమార్, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, హరినాథ్‌రెడ్డి, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

780మందికి ఉచిత వైద్య సేవలు


కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 780 మందికి వైద్యసేవలు అందించారు. దంతవైద్య శిబిరంలో 160 మందికి, జనరల్ వైద్య శిబిరంలో 250 మందికి, చర్మవ్యాధులకు సంబంధించి 120 మందికి, కంటి వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా మందులు అందజేశారు. కార్పొరేటర్ గుడివాడ అనూష ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో రైజ్ హాస్పిటల్ నుంచి డాక్టర్ అవినాష్ వేగి, ఆర్‌కే డెంటల్ కేర్ నుంచి డాక్టర్ మీనాక్షి పరిమి, చర్మవ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ నళిని పీలా, గాజువాక బెస్ట్ విజన్ హాస్పిటల్ నుంచి కంటి వైద్య నిపుణులు డాక్టర్ పావని వాడపల్లి హాజరై, రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, నంబారు రాజు, శ్రీనివాసరావు, శశిభూషణరావు, ఎం.సత్యవతి, గొంతిన శ్రీనివాసరావు, నేలపాటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో నీటి వెతలు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డు సుందరయ్య కాలనీలో నీటి సరఫరా సరిగ్గా లేక స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమాచారం లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా ఆపేస్తున్నారని వాపోతున్నారు. కొండవాలు ప్రాంతానికి చెందిన తమ కాలనీలో నీటి సరఫరాకు నిర్దిష్ట సమయం ఉండటం లేదని తెలిపారు. అరకొరగా ఇస్తున్న నీరు కూడా రంగుమారి వస్తున్నాయన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. మోటార్లు పాడైపోవడంతో సరఫరాలో ఇబ్బంది వస్తోందంటూ నీటి సరఫరా సిబ్బంది చెబుతున్నారని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై సహాయ ఇంజినీరు కేదార్‌నాథ్‌ను సంప్రదించగా మోటార్లన్నీ సరిగానే పని చేస్తున్నాయని, నీటి సరఫరాకు కూడా ఇబ్బంది ఏమీ లేదని తెలిపారు. సుందరయ్య కాలనీలో స్వయంగా పరిశీలించి సమస్య ఉంటే పరిష్కరిస్తామని చెప్పారు.